క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

నారాయణఖేడ్: ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలపై శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం మల్లేశయ్య తెలిపారు. ఉ. 10 గంటల నుంచి 11గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. ఆర్టీసీ పరంగా సలహాలు, సూచనలు అందజేయాలని, ప్రయాణికులు ఎవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. సమస్యలపై 9063417161 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకోండి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్

హత్నూర(సంగారెడ్డి): అర్హులైన నిరుపేదలకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకోవాలని తహసీల్దార్ పర్వీన్ షేక్ సూచించారు. గురువారం హత్నూర మండలం ముచ్చర్ల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. గ్రామాన్ని మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని మంజూరైన ఇళ్లను ప్రతి ఒక్కరూ నిర్మించుకోవాలని తహసీల్దార్ చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శంకర్ ఎంపీఈఓ యూసుఫ్, తాజా మాజీ ప్రజాప్రతినిధులు స్థానికులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనుల పరిశీలన


లబ్ధిదారులతో మాట్లాడుతున్న చలపతిరావు

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలంలోని జాంగార్‌బోలీతండాలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పనులను గురువారం హౌసింగ్ పీడీ చలపతిరావు పరిశీలించారు. తండాలో నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్ల పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. తండాకు మంజూరైన ప్రతీ ఇంటిని పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట ఏఈ మాధవరెడ్డి, ఎంపీడీఓ మహేశ్, పంచాయతీ కార్యదర్శి మహేష్ ఉన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

సంగారెడ్డి టౌన్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అన్నారు. గురువారం సీపీఎం ఆధ్వర్యంలో సంగారెడ్డి మండలం కల్పగూర్, ఇరిగిపల్లి గ్రామాల్లో ఉపాధి కూలీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధికి నిధులు తగ్గించిందని విమర్శించారు. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు ఉండటం లేదన్నారు. కేరళ రాష్ట్రం మాదిరి ఉపాధి కూలీలకు రోజుకు రూ.720 ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెంటనే పెండింగ్ నిధులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నర్సింలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజాసమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని డివిజన్ కార్పొరేటర్ పుష్ప పేర్కొన్నారు. గురువారం మల్లికార్జున నగర్‌కాలనీ నాలాల్లో చెత్త తొలగించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రూ.40 లక్షల నిధులతో లింగంపల్లి నుంచి కనుకుంటా, జ్యోతినగర్, ఇసుకబావి వరకు నాలాలోని చెత్తను తొలగించనున్నట్లు చెప్పారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పనులు చేస్తున్నామని వివరించారు. కాలనీవాసులు బాల్‌రెడ్డి, సత్యనారాయణ, అరుణ్‌సింగ్ పాల్గొన్నారు.

వైభవోపేతంగా కాలకీర్తన


నగరకీర్తన నిర్వహిస్తున్న గజేంద్ర భారతీ

నారాయణఖేడ్: పట్టణంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న సప్తహ కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా అంతర్గాం పీఠాధిపతి కరణ్ గజేంద్ర భారతీ మహారాజ్ కాలకీర్తన నిర్వహించారు. అనంతరం వారీకార్ సంప్రదాయ భజనలతో నగర ప్రదర్శన చేశారు. పూజలు చేసి భక్తులకు ప్రసాద వితరణ చేశారు. మాజీ కౌన్సిలర్ వివేకానంద్, ఆలయ కమిటీ బాధ్యులు ముత్యంపు హన్మాండ్లు, పాండు పాల్గొన్నారు.

వేసవి వేళ.. జర జాగ్రత్త

చిన్నారులను చిదిమేస్తున్న సరదా

- బడి వదిలాక పిల్లల సంరక్షణే ప్రాధాన్యం
- తల్లిదండ్రులు, పాఠశాలల యాజమాన్యాల శ్రద్ధ తప్పనిసరి



సంగారెడ్డి : వేసవి దృష్ట్యా ఒంటిపూట బడులు సాగుతున్నాయి. మధ్యాహ్నం నుంచి సెలవు కావడంతో పిల్లలు ఆటలాడేందుకు బయటకు వెళ్లడం సహజం. ఒక్కోసారి ఆనందం వెన్నంటే విషాదాలు పొంచి ఉంటాయి. ఈత, బైక్ రైడింగ్, మండేఎండలు చిన్నారులను ముప్పు తిప్పలు పెడతాయి. పిల్లలను సంరక్షించుకొని ప్రమాదాల బారిన పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, పాఠశాలల యజమాన్యాలపై ఉంది. ఇంటర్, పది పరీక్షలు పూర్తయి పాఠశాలకు ఒంటిపూట బడుల నేపథ్యంలో పిల్లల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సాక్షి కథనం.

ఇంట్లో చెప్పరు.. టైంకు తినరు ..

పిల్లలకు పూర్తి స్వేచ్ఛనిస్తే అది భవిష్యత్తు ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తుందని మానసిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒంటి పూట బడుల సమయంలో పిల్లలతో కలిసి సరదాలకు అలవాటవుతారు. తల్లిదండ్రులు ఎంత వారించినా ఇంటిపట్టన ఉండేందుకు సుముఖత చూపారు. ఇంట్లో చెప్పకుండా సరదా కోసం వెళ్లి ప్రమాదాల బారిన పడుతుంటారు. ఎండలో తిరగడం వల్ల పిల్లలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు.

బైక్‌తో ప్రమాదాలెన్నో ...

ఇంటర్, పదవ తరగతి పరీక్షలు పూర్తయ్యాయి. పిల్లలు ఇంటికి రాగానే ద్విచక్ర వాహనాలు, కార్లు నడపాలని సరదా పడుతారు. పిల్లల సరదాలకు తల్లిదండ్రులు వాహనాల తాళాలను ఇస్తుంటారు. కొందరు చిన్నారులు పెద్దల కళ్లుగప్పి వాహనాలను తీసుకెళ్తుంటారు. ద్విచక్ర వాహనాలు, సైకిళ్లపై మోజుతో ప్రమాదాలు కొని తెచ్చుకుంటారు. అతివేగం అపరిమిత డ్రైవింగ్‌పై అవగాహన లేకపోవడంతో పిల్లల మరణాలే కాకుండా క్షతగాత్రులుగా మారుతున్నారు. కొందరు జీవితాంతం అంగవైకల్యంతో నరకం అనుభవిస్తున్నారు.

మండే ఎండలతో ప్రమాదం..

మండే ఎండల వల్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్త తీసుకోవాలి. పిల్లలు బడి నుంచి ఇంటికి రాగానే పుస్తకాల బ్యాగును పక్కన పడేసి ఆటలాడేందుకు స్నేహితులతో కలిసి బయటకు వెళ్తారు. ఎంత ఎండ ఉన్న వారికి పట్టదు. 40 డిగ్రీల సెల్సియస్ ఎక్కువ ఉష్ణోగ్రతలో ఆడితే అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంది. ఎండలు ముదిరితే వడగాలులు వస్తాయి అవి మరీ ప్రమాదకరం.

– పరశురామ్, ప్రభుత్వ జనరల్ సర్జన్

జాగ్రత్తలు పాటిస్తే మంచిది..



ఒంటిపూట బడి వదలగానే మధ్యాహ్నం పిల్లల్ని ఇంటి నుంచి బయటకు పంపించొద్దు. ఇంట్లోనే అత్యధిక సమయం గడిపేలా చూడాలి. వీలును బట్టి తల్లిదండ్రులు పిల్లలతో ఎక్కువ సమయం గడిపాలి. పిల్లలు ఇంటి నుంచి బయటకు వెళ్లే సమయంలో తల్లిదండ్రులకు సమాచారం ఉండాలి. ఈత సరదా, షికార్లు, ఎండలో ఆటలు నిలువరించి వారిని వేరే వ్యాపకంపై దృష్టి మరల్చేలా చూడాలి. కంప్యూటర్, వీడియో గేమ్, టీవీలకు అతుక్కుపోకుండా పుస్తక పఠనం చేయించాలి.

పారితోష్ పంకజ్, జిల్లా ఎస్పీ


రోడ్డుపై ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

తాగునీటి కోసం ఆందోళన

హత్నూర(సంగారెడ్డి): తాగునీటి కోసం ప్రజలు అల్లాడుతున్న అధికారులు పట్టించుకోవడం లేదు. నిత్యం ఇబ్బంది పడుతున్నామని ఆగ్రహించిన సిరిపురం గ్రామస్తులు గురువారం రోడ్డెక్కారు. గత కొన్ని రోజులుగా తాగు నీటికి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నా గ్రామపంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టడంతో వాహనాలు నిలిచిపోయాయి. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు.

మూల్యాంకన భత్యాన్ని రెట్టింపు చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పదవ తరగతి పరీక్ష పత్రాల మూల్యాంకన భత్యాన్ని రెట్టింపు చేయాలని స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ సాబేర్ అలీ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రాథోడ్ డిమాండ్ చేశారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. 2018 సంవత్సరంలో జీఓ నంబర్ 11 ద్వారా స్పాట్ రేట్లు అమల్లోకి వచ్చి ఏడు సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు పెంచకపోవడం బాధాకరమన్నారు. ప్రధానంగా స్పెషల్ అసిస్టెంట్లకు రోజువారి గౌరవ వేతనం రూ.250 ఉండటం శోచనీయమన్నారు. వారికి ఎలాంటి భత్యాలు ఉండవన్నారు. ప్రభుత్వం స్పందించి స్పెషల్ అసిస్టెంట్‌లకు రవాణా భత్యం, దినసరి భత్యం, టీఏ, డీఏ చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్, రాష్ట్ర, జిల్లా నాయకులు రమణ కుమార్, ప్రభాకర్ రెడ్డి, లక్ష్మయ్య, కాశీరాం, దేవదానం ఉన్నారు.

బీజేపీపై విమర్శలు దురదృష్టకరం

ఎమ్మెల్సీ అంజిరెడ్డి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: కాంగ్రెస్ పార్టీ అంటేనే ప్రజలను మోసం చేసే పార్టీ అని ఎమ్మెల్సీ అంజిరెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు బీజేపీపై విమర్శలు చేయడం దురదృష్టకరమన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బ్రిటీషర్లు భారతదేశాన్ని బులెట్లతో పాలిస్తే బీజేపీ సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్ అంటూ ప్రజల మనసును గెలుస్తూ దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తన వైఫల్యాలను దాచేందుకు బీజేపీపై అర్థంలేని విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. అతితక్కువ కాలంలోనే ప్రజల్లో వ్యతిరేకత వచ్చిన మొదటి సీఎం రేవంత్ రెడ్డినే అని అన్నారు. పార్టీ అధికారంలో ఉన్నా ఇటీవలే జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో సిట్టింగ్ స్థానాన్ని కూడా గెలిపించుకోలేక పోయాడన్నారు. కనీసం తను ఎంపీగా ఉన్న మల్కాజ్‌గిరి స్థానాన్ని సైతం గెలపించుకోలేకపోయడని దుయ్యబట్టారు. తెలంగాణలో బీజేపీకి రోజు రోజుకు ప్రజల మద్దతు పెరుగుతుందని తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, రాష్ట్ర నాయకులు దేశ్‌పాండే, రాజశేఖర్ రెడ్డి, వెంకటనర్సింహారెడ్డి, మీనాగౌడ్, ప్రవీణ్, మల్లికార్జున్ పాటిల్, విజయ్‌కుమార్, రవి, మల్లేశం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి,తదితరులు


దీక్షలో పాల్గొన్న కార్మికులు, జేఏసీ నాయకులు

డంపింగ్ ఏర్పాటు ప్రజాస్వామ్య విరుద్ధం

జిన్నారం (పటాన్‌చెరు): డంపింగ్‌యార్డ్ ఏర్పాటుపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలు 56వ రోజుకు చేరాయి. గురువారం బొంతపల్లి శ్యామ్ పిస్టిన్ పరిశ్రమ కార్మికులు నిరాహార దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. స్థానికల అభిప్రాయాలు సేకరించకుండా డంపింగ్ యార్డ్ నిర్మాణం చేపట్టడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. 56 రోజులుగా నిరసనలు చేపడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డంపింగ్ యార్డ్ ఏర్పాటును విరమించుకోవాలని కోరారు. కార్యక్రమలో జేఏసీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

అభ్యంతరాలపై నోటీసు

డంపింగ్‌యార్డ్ ఏర్పాటుపై అభ్యంతరాలుంటే తెలియజేయాలని తహసీల్దార్ పరమేశం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతానికి గురికాకుండా ఉండేందుకు డంపింగ్‌యార్డ్ ఏర్పాటుకు ప్రతిపాదించామన్నారు. నోటీసులు ప్రకటించిన 15 రోజుల్లో ఏమైనా అభ్యంతరాలు ఉంటే చెప్పవచ్చని అన్నారు. నోటీసు వ్యవధి ముగిసిన తర్వాత అభిప్రాయాలు, పిటిషన్లు స్వీకరించడం జరగదు.


కంప్యూటర్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ క్రాంతి

కంప్యూటర్ల పంపిణీ

సంగారెడ్డి జోన్: విద్యార్థులకు హత్నూర బీఆర్ అంబేడ్కర్ సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలకు 10 కంప్యూటర్లను పంపిణీ చేశారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి కళాశాల విద్యార్థులకు అందజేశారు. జేఈఈ, నీట్ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థుల సౌకర్యార్థం కంప్యూటర్లను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్ ఉన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా, జైలు శిక్ష విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం బుధవారం నిర్వహించిన తనిఖీల్లో 12 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని గురువారం కోర్టులో హాజరు పర్చగా 9 మందికి రూ.1500 చొప్పు న, ఒక్కరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు. అలాగే, ఒకరికి నాలుగు రోజులు, మరోకరికి మూడు రోజులు జైలుశిక్ష, జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

పైపులైన్ లీకేజీ.. నీరంతా వృథా

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం గడ్డపోతారం మున్సిపాలిటీలో పైప్‌లైన్ లీకేజీ కావడంతో నీరు వృథాగా పోతుందంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. వేసవిలో నీరు వృథా చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. రోడ్డుపైకి చేరిన నీటితో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. మున్సిపల్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

మహాదేవుని ఉత్సవాల్లో భక్తి పారవశ్యం


అగ్నిగుండంలో నడుస్తున్న భక్తులు

కంగ్టి(నారాయణఖేడ్): మహాదేవుని భక్తిలో గ్రామస్తులు పరవశించిపోయారు. డప్పుల చప్పుళ్లు, శివసత్తుల విన్యాసాలు, జై మహాదేవ్, హరహర మహాదేవ్ నినాదాలు.. అగ్నిగుండం ప్రవేశంతో భక్తులు భక్తిశ్రద్ధల్లో మునిగిపోయారు. కంగ్టి మండలంలో గాజుల్‌పాడ్ గ్రామంలో మహాదేవుని ఆలయ వార్షికోత్సవంలో భాగంగా గురువారం భక్తులు భారీ సంఖ్యలో మహాదేవుడిని దర్శించుకొన్నారు. మహాదేవుడి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. మహిళలు పూనకంతో ఊగిపోయారు. అగ్నిగుండం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అగ్నిలో నడిచారు. ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. శుక్రవారం జరిగే రథోత్సవానికి ఇటీవల నూతనంగా తయారు చేసిన రథాన్ని అలంకరించారు.

కార్మిక చట్టాలను తుంగలో తొక్కిన కేంద్రం

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కారాములు

పటాన్‌చెరు టౌన్: రాజ్యాంగాన్ని కార్మికవర్గం కాపాడుకోవాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కారాములు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ పిలుపునిచ్చారు. సామాజిక న్యాయ వారోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని ఐలా భవన్‌లో సీఐటీయూ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగం-అంబేడ్కర్-కార్మికవర్గ కర్తవ్యం అనే అంశంపై సీఐటీయూ జిల్లా కోశాధికారి రాజయ్య అధ్యక్షతన సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికవర్గంపై దాడిని మరింత తీవ్రతరం చేసిందని మండిపడ్డారు. ఇందులో భాగంగానే కార్మిక చట్టాలను పూర్తిగా తుంగలో తొక్కిందన్నారు. 29 చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి పార్లమెంట్‌లో ఆమోదింప చేసుకొని అమలుకు ప్రయత్నం చేస్తుందన్నారు. భవిష్యత్తులో జరిగే అన్ని పోరాటాల్లో కార్మికవర్గం కేంద్ర విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పాండురంగారెడ్డి, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, శాంతకుమార్, అనంతరావు, శ్రీధర్, వెంకటేశ్వరరావు కార్మికులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చుక్కా రాములు

ఎత్తిపోతల పథకం పంప్ హౌస్‌లో చోరీ

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని అమీరాబాద్ గ్రామ సమీపంలో ఉన్న ఎత్తిపోతల పథకం పంప్ హౌస్‌లో చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగలు మోటారును పగులగొట్టి అందులోని కాపర్‌వైర్‌ను ఎత్తుకెళ్లారు. ఈ ఘటన రెండు రోజుల క్రితం చోటు చేసుకుంది. గ్రామస్తులు కథనం ప్రకారం.. ఎత్తిపోతల పథకంలో భాగంగా మంజీరా నది వద్ద ఏర్పాటు చేసిన పంప్ హౌస్‌లోని మోటార్లు దశాబ్దాల క్రితం నుంచి నిరుపయోగంగా ఉన్నాయి. రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ మోటారును పగులగొట్టి అందులోని విలువైన కాపర్ వైర్లను ఎత్తుకెళ్లారు. బుధవారం ఉదయం పొలం పనుల కోసం వెళ్లిన రైతులు విద్యుత్ మోటారును పగులగొట్టిన విషయాన్ని సంబంధిత అధికారులకు తెలియజేశారు. గురువారం ఉదయం ఇరిగేషన్ ఏఈఈలు శ్రీధర్ తదితరులు ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. మోటారు పగులగొట్టి కాపర్‌వైర్‌ను ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. పర్ వైర్ విలువ రూ.50 వేలు ఉంటుందని తెలిపారు.


విద్యుత్ మోటార్లను పరిశీలిస్తున్న ఏఈఈలు

సంక్షిప్త వార్తలు

◆ సదాశివపేటలో 23 రిజిస్ట్రేషన్లు

సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ విధానం అమలు చేయడంతో గురువారం వరకు ఆన్‌లైన్‌లో 23 స్లాట్ బుకింగ్ అయ్యాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు 23 రిజిస్ట్రేషన్లు పూర్తి చేశామని సబ్ రిజిస్ట్రార్ వాహిద్ అహ్మద్ తెలిపారు.

◆ వీరాంజనేయస్వామికి పూజలు

తూప్రాన్: పట్టణంలోని పెద్ద చెరువుకట్టపై ఉన్న వీరాంజానేయ ఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. అర్చకుడు ఆత్రేయశర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, అఖండ దీపారాధన, అంకురార్పణం, సుందర కాండ పూజలు నిర్వహించారు.

◆ వైభవంగా రథోత్సవం

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం మంగంపేటలో సీతారాముల రథోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీరామనవమిని పురస్కరించుకొని గురువారం సీతారాముల విగ్రహమూర్తులను గ్రామ వీధుల్లో ఊరేగించారు. దీంతో గ్రామంలో పండగ వాతావరణం చోటు చేసుకుంది. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, కొలన్ బాల్‌రెడ్డి, వెంకటేశం గౌడ్, మాజీ ఎంపీపీ రవీంద్రగౌడ్ వీరితో పాటు జేపీపీ మండల అధ్యక్షుడు జగన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

◆ మొగుడంపల్లిలో గ్రాడ్యుయేషన్ డే

జహీరాబాద్ టౌన్: మండల కేంద్రం మొగుడంపల్లిలో గురువారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అంగన్‌వాడీలో చదువుతున్న చిన్నారుల చదువులు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పిల్లలకు సర్టిఫికెట్లు, బహుమతులు ఇచ్చారు. కార్యక్రమానికి హాజరైన సూపర్‌వైజర్ సద్గుణ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ద్వారా తల్లిదండ్రులు వారి పిల్లల అభివృద్ధి చూసి ప్రోత్సహించదానికి మంచి అవకాశామన్నారు. మెడికల్ ఆఫీసర్ సింఫోనియా, అంగన్‌వాడీ టీచర్లు కరుణ, రెహనా, తుల్జమ్మ, రజని, సరస్వతి, ఉమారాణి, ఆశావర్కర్, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

◆ బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి

నారాయణఖేడ్: గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పత్తిరి రామకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలో బీజేపీ 45వ వ్యవస్థాపక వారోత్సవాల్లో భాగంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ విజయాల్లో కార్యకర్తలే వెన్నెముక అని, పార్టీకోసం తమ జీవితాలను అంకితం చేసిన వారి సేవలు మరువలేనివన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ అసెంబ్లీ కన్వీనర్ రజినికాంత్, మండల, పట్ట పార్టీ అధ్యక్షుడు దశరథ్, రాజశేఖర్ గౌడ్ ఉన్నారు.


జహీరాబాద్ మండలంలోని దిడ్గి గ్రామంలో..


జిన్నారం : విద్యుత్ తీగలపై పడిన చెట్టు


కూలిపోయిన రేకుల ఇల్లు

అకాల వర్షం.. అవస్థలు

జిల్లాలోని పలు చోట్ల సాయంత్రం ఒక్కసారిగా ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. గాలులకు ఇంటిపై ఉన్న రేకులు ఎగిరిపోయాయి. పెద్దపెద్ద చెట్లు నేలకొరిగాయి, విద్యుత్ స్తంభాలు, కరెంట్ తీగలు తెగిపడ్డాయి. మొక్కజొన్న, జొన్న పంటకు నష్టం వాటిల్లింది. ఈదురుగాలుల వల్ల విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు అవస్థలు పడ్డారు.


నారాయణఖేడ్‌లో..


నారాయణఖేడ్: బురద, చెత్తను తొలగిస్తున్న కార్మికుడు